క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్: జగిత్యాల మండలం కల్లెడ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 3.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. అనంతారం, గుట్రాజ్‌పల్లి, తక్కళ్లపల్లి, సంగంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్, కల్లెడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆ యన కోరారు.

పరామర్శ

ధర్మపురి : మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గొల్ల కిషన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

'హామీలు నెరవేర్చాలి'

జగిత్యాలటౌన్: బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నాయకులు సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు సత్యనారాయణరావు, భోగ శ్రావణి, పన్నాల తిరుపతిరెడ్డి, కస్తూరి సత్యం, జున్ను రాజేందర్, జుంబర్తి దివాకర్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

రాయికల్: మండలంలోని ఒడ్డె లింగాపూర్, చింతలూరు గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట సర్పంచులు బెక్కం తిరుపతి, అనుపురం శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, తదితరులున్నారు.

రైతులకు అవగాహన

వెల్గటూర్: ఎండపల్లి మండలం గొడిశెలపేట క్లస్టర్ పరిధిలోని రైతులకు ఏఈవో వినోద్ క్రాప్ దర్పన్ అప్లికేషన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వరి, పత్తి పంటలో వచ్చే తెగుళ్లను సులభంగా గుర్తించి సస్యరక్షణ చర్యలు తెలిపేందుకు క్రాప్ దర్పన్ అప్లికేషన్ ఉపయోగపడుతుందన్నారు. దేవేందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూమిపూజ

వెల్గటూర్ : మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయానికి సోమవారం సర్పంచ్ మేరుగు మురళిగౌడ్ భూమిపూజ చేశారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఈజీఎస్ నిధుల ద్వారా పంచాయతీ భవనాన్ని నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సారంగాపూర్: మండలంలోని నాగునూర్ గ్రామానికి చెందిన రేగుంట నర్సయ్య అటవీశాఖ రాయికల్ రేంజ్ పరిధిలోని అడవిలో బేస్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్నాడు. చెట్ల మొట్లు కాలుకు తగిలి తీవ్రగాయాలుకాగా ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. సోమవారం అటవీశాఖ అధికారులు రూ.22 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ రాయికల్ అటవీశాఖ డెప్యూటీ రేంజర్ చంద్రమౌళి, సెక్షన్ అధికారులు మల్లయ్య, విజయ్‌కుమార్, బీట్ అధికారి రమణారెడ్డి, నరేశ్, బేస్‌క్యాంపు, దేవేందర్, తదితరులున్నారు.

అధికారులు తనిఖీ చేయాలి

కోరుట్ల: పట్టణ శివారులోని మెట్‌పల్లి రోడ్డు వెటర్నరీ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ తూకంలో మోసం జరుగుతుందని కోరుట్లకు చెందిన జమీల్ ఆందోళన వ్యక్తం చేశాడు. తాను హైదరాబాద్ వెళ్లే క్రమంలో రూ. 2వేల పెట్రోల్ తన కారులో పోయించగా కామారెడ్డి వద్దే పెట్రోల్ పూర్తిగా అయిపోయిందన్నారు. దీనిపై బంక్ సిబ్బందిని అడిగితే దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. బకెట్‌లో 15 లీటర్ల పెట్రోల్ పోయించగా 12 లీటర్లే వచ్చిందని తెలిపాడు. ఇప్పటికైనా తూనికలు కొలతల అధికారులు పెట్రోల్ బంక్‌లను తనిఖీలు చేయాలని కోరారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

జగిత్యాలటౌన్: వివిధ హోదాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఓల్డ్ హైస్కూల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్న ఉద్యోగులు.. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణికి రెండు దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఏపీఎంవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, ఇద్దరే అధికారులు హాజరయ్యారు. ఆయాశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో భద్రం.!

- ఇంటివద్దకే వస్తువులు వస్తుండటంతో ప్రజల మొగ్గు
- మోసపూరిత ప్రకటనలు, ఆఫర్లను నమ్మితే అంతే..
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు



గొల్లపల్లి: గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ షాపింగ్‌లు నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి. ఆండ్రాయిడ్ ఫోన్ల వాడకం ఎక్కువ కావడంతో చాలామంది ఆన్‌లైన్ షాపింగ్ వైపు మొగ్గుచూపుతున్నారు. బైవన్ గెట్ వన్, ఉచిత డోర్ డెలివరీ, యాభైశాతం నుంచి 75 శాతం వరకు డిస్కౌంట్లు అంటూ ఇలా ఎన్నో ఆఫర్లు దర్శనమిస్తున్నాయి. అయితే చాలామంది ఉద్యోగాలు, ఇంటి పనులతో సమయం దొరకక ఆన్‌లైన్ షాపింగ్‌లో ఆర్డర్ చేస్తుండగా ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా మోసపోయే ప్రమాదముంది. తగిన సూచనలు పాటిస్తూ, ఆన్‌లైన్ షాపింగ్ చేయాలని నిపుణులు, పోలీసులు సూచిస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ షాపింగ్‌పై అన్ని వర్గాలవారు ఆసక్తి కనబరుస్తున్నారు. షోరూంలలో కనిపించని వస్తువులెన్నో ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి. కానీ నెట్‌లో కనిపించే ప్రకటనలన్నీ నమ్మితే మోసంపోవడం ఖాయం. ఒకటి ఆర్డర్ ఇస్తే డెలివరీ అయ్యేది మరొకటి. పైగా ధరల్లో తేడాలు, మోసపోతే ఎవరిని సంప్రదించాలో తెలియ ని పరిస్థితి ఉంది.

ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా తక్కువ ధరలకే వివిధ రకాల ఉత్పత్తులు లభిస్తున్నాయి. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు, ఫర్నీచర్, రెడీమేడ్స్, లేడీస్ యాక్సెసరీస్, కాస్మోటిక్స్, స్మార్ట్‌ఫోన్లు, ఎన్నో రకాల ఉత్పత్తులు ఉన్నాయి. ఆర్డర్ చేసిన కొద్ది రోజుల్లోనే ఆయా కంపెనీలు వాటిని నేరుగా ఇంటికే సరఫరా చేస్తాయి. అయితే ఇది బాగానే ఉన్నా కొన్ని మోసపోయిన సందర్భాలున్నాయి.

ప్రకటనలకు దూరంగా ఉండాలి

ఆకర్షణీయమైన ప్రకటనలను ఇచ్చే కంపెనీల్లో నమ్మకమైనవే కాకుండా కొన్ని బోగస్ కంపెనీలూ ఉంటాయి. స్మార్ట్‌ఫోన్ కోసం ఆర్డర్ చేస్తే ఇంటికి వచ్చాక ప్యాక్ తెరిస్తే బొమ్మఫోన్ లేదా, రాళ్లు నింపి పంపించడం రెడీమెడ్ వస్తువుల కోసం ఆర్డర్ ఇస్తే నాసిరకం ఉత్పత్తులు పంపిన సందర్భాలూ ఉన్నాయి. తీరా వారిచ్చిన నంబర్‌కు ఫోన్ చేసినా ఫలితం ఉండదు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉండాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సదరు కంపెనీ ఎలాంటి ఉత్పత్తులు వ్యాపారం చేస్తుందో తెలుసుకోవాలి.
- కంపెనీకి సంబంధించిన వివరాలు ముందే తెలుసుకోవాలి.
- ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులు, షాపింగ్ మాల్స్‌లో లభించే వస్తువుల ధరల్లో ఏమైనా తేడా ఉందో లేదో గమనించాలి.
- ఆయా ఉత్పత్తులపై ఇచ్చే డిస్కౌంట్, ఆఫర్ల గురించి అవగాహన ఉండాలి.
- ఆన్‌లైన్ మోసాలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేశారు. మోసపోయినట్లు తెలిస్తే వెంటనే సైబర్‌క్రైం విభాగానికి ఫిర్యాదు చేయొచ్చు.
- ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువుల ప్యాకింగ్‌పై కంపెనీల చిరునామా, తదితర విషయాలు తెలుసుకోవాలి.

ప్రకటనలను నమ్మొద్దు



ఆన్‌లైన్‌లో కనిపించే ప్రకటనలన్నీ నమ్మొద్దు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఆయా కంపెనీల గురించి తెలుసుకోవాలి. లేకపోతే మోసపోయే అవకాశం ఉంది. సైబర్ నేరగాళ్ల గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలి.

– రమణ మూర్తి, సీఐ, ధర్మపురి

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు
- కోరుట్లలో టీ-హబ్, వి-హబ్ శిక్షణ కార్యక్రమం

కోరుట్ల: విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత వచ్చే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణంలోని కటుకం సంఘయ్య ఫంక్షన్ హాల్‌లో వీ-హబ్, టీ-హబ్ వారి నేతృత్వంలో సోమవారం నియోజకవర్గంలోని డిగ్రి మహిళా విద్యార్థులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో డిగ్రి పూర్తిచేసిన విద్యార్థినులు టీ-హబ్, వీ-హబ్ వారి సహకారంతో మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలనే సంకల్పంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విద్యార్థులకు హైదరాబాద్‌లో టీ-హబ్, వీ-హబ్ సందర్శనతో పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల శిక్షణతో పాటు, ఐటీ రంగంపై పరిజ్ఞానం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి, షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణాలకు భూమిపూజ

కోరుట్ల రూరల్ : మండలంలోని కల్లూర్ శివారులో గల ప్రెస్టేజ్ పార్క్ వెంచర్‌లో నూతనంగా నిర్మించే కార్డియాలజీ ఆస్పత్రి, సీబీఎస్ఈ పాఠశాల, ఇగ్లూ థియేటర్, షాపింగ్‌మాల్‌ల నిర్మాణాలకు సోమవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి, స్కూల్, థియేటర్, షాపింగ్ కాంప్లెక్స్ ఒకే చోట నిర్మిస్తున్న వెంచర్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ నిర్మాణాలతో కోరుట్ల మండలంతో పాటు పరిసర మండలాల్లోని 70–80 గ్రామాలకు విద్యా, వైద్యసేవలు అందుతాయన్నారు. ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు రాజేశ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచ్ వంతడుపుల అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

ఇబ్రహీంపట్నం : రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఎంపీపీ జాజాల భీమేశ్వరి, మండల ఎంపీటీసీలు అన్నారు. సోమవారం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుంట్ల సంజయ్‌ను ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు చిన్నారెడ్డి, మండల ఎంపీటీసీలు , బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

అసైన్డ్ భూముల రైతులకు షరతులతో పంట రుణాలు

సాక్షి స్పందన

సారంగాపూర్: అసైన్డ్ భూములు కలిగిన రైతులకు కొన్ని షరతులతో పంట రుణాలు ఇచ్చేందుకు కేడీసీసీ బ్యాంకు అంగీకరించిందని ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు పేర్కొన్నారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన అసైన్డ్ భూములకు అందని రుణాలు అన్న శీర్షికన కథనం ప్రచురితం కాగా స్పందించిన ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ సహకార బ్యాంక్ కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం పాలకవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారన్నారు. అసైన్డ్ భూములకు అందని పంట రుణాలపై ప్రధాన చర్చ జరిగిందని, అసైన్డ్ భూమి కలిగిన రైతులకు రైతుబంధు సొమ్ముతో పాటు, పండించిన ధాన్యం డబ్బులు రెండు కెడీసీసీ బ్యాంకులో తమ ఖాతాల్లో జమ చేసుకుంటే పంట రుణాలు అందించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు అసైన్డ్ భూములపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణాలు పొందిన రైతులకు తక్షణమే రెన్యూవల్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయన వెంట కొల్వాయి, సారంగాపూర్, కోనాపూర్ సహకార సంఘాల అధ్యక్షులు పొల్సాని నవీన్‌రావు, నర్సింహారెడ్డి, గుర్నాథం మల్లారెడ్డి తదితరులున్నారు.

నాచుపల్లి గోదాముల్లో తనిఖీలు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపల్లి సివిల్ సప్లయ్ గోదాములపై టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సెలు కృష్ణజంగయ్య, స్పెషల్ ఆఫీసర్ అంజయ్య ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ తిరస్కరించిన 870 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. వెల్గటూర్ మండలానికి చెందిన మారుతి ఇండస్ట్రీస్, గొల్లపల్లి మండలానికి చెందిన టీఎస్ఆర్ రైస్ మిల్లుల యజమానులు అక్రమంగా బియ్యం పంపినట్లు వారు గుర్తించారు. వాటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివేదిక ఆధారంగా గోదాం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోదాముల బయట పార్క్ చేసిన లారీలోని బియ్యాన్ని తిరస్కరించాలని అధికారులను ఆదేశించారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

టీడీఆర్ సర్టిఫికెట్ల జారీకి అనుమతి

జగిత్యాల: పట్టణంలోని యావర్‌రోడ్డు విస్తరణకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) సర్టిఫికెట్ల జారీకి మెమో జారీచేశారు. అత్యధికంగా రద్దీ ఉండే యావర్‌రోడ్డును సులభం విస్తరించాలనే ఉద్దేశంతో ఈ సర్టిఫికెట్ జారీచేశారు. యావర్‌రోడ్డు విస్తరణలో దాదాపు 284 మంది ప్రైవేట్ భవనాలు కోల్పోయే అవకాశం ఉంది. కాగా, యావర్‌రోడ్డు విస్తరణకు సర్టిఫికెట్ల జారీ మంచి శుభపరిణామమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. దీనిద్వారా నాలుగింతలు లబ్ధి జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు కవిత, ఎల్.రమణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సీడీఎంఏ జారీ చేసిన మెమో

ట్రేడ్ లైసెన్స్ ఉందా?



బాధితుడు మణిరాజ్

జగిత్యాల: స్థానిక కాంతిభవన్ ఎదుట గల లక్కీ గిఫ్ట్‌కార్నర్ యజమాని మణిరాజ్‌కు రాత్రి 7 గంటల సమయంలో ఫోన్‌కాల్ వచ్చింది. «నేను కమిషనర్‌ను మాట్లాడుతున్నా.. నీ దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ లేదు.. వెంటనే లైసెన్స్ తీసుకోవాలి.. డబ్బులు కట్టాలి» అని ఎవరో ఫోన్ చేశారు. తనకు ట్రేడ్ లైసెన్స్ ఉందని, ఎందుకు డబ్బులు కట్టాలని మణిరాజ్ బదులిచ్చాడు. అయినా, డబ్బు కట్టాల్సిందేనని అవతి వ్యక్తి చెప్పడంతో ఆందోళన చెందిన మణిరాజ్.. వెంటనే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాడు. సిబ్బందిని కలిసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. అయితే, సిబ్బందితో కాల్ బ్యాక్ చేయించగా కమిషనర్‌ను మాట్లాడుతున్నానని అవతలి వ్యక్తి జవాబు ఇ చ్చా డు. రికార్డు చేసే సమయంలో వెంటనే కాల్ కట్‌చేశాడు. బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని సిబ్బంది సూచించారు. ఇ ప్పటికే రెవెన్యూ అధికారులకు ఇటీవల అగంతకులు ఫోన్‌చేసి పలు విధాలుగా బెదిరించిన విషయం మర్చిపోకముందే.. దుకాణాదారులకు మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్‌రావడం ఆందోళన కలిగిస్తోంది.

కళాశాలల్లో ముందస్తు రక్షాబంధన్

కోరుట్ల: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల్లోని విద్యార్థులు ఏబీవీపీ నాయకులకు రాఖీలు కట్టారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాడవేణి సునీల్, పవన్, సంజీవ్, మహదేవ్, వినయ్, రాఘవేంద్ర, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

'వర్గపోరు రాజకీయాలు సరికాదు'

కథలాపూర్: బీఆర్ఎస్‌లో వర్గపోరు రాజకీయాలు చేయడం సరికాదని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, పోసాని పేట సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి అన్నారు. సోమవారం కథలాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సొంత గ్రామంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నేత పర్యటిస్తే తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. సీనియర్ నాయకుల తోపాటు ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష చూపిస్తే పార్టీకి నష్టం జరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

దళితబంధు, బీసీబంధు అందరికీ ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం : బడుగు బలహీనవర్గాల ఓటర్లతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు, బీసీబంధు అందరికీ ఇవ్వాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బాలే రావురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెడుతున్నారన్నారు. అమ్మక్కపేటలో రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ తాగునీరు సరాఫరా చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెగడపల్లి: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. మండలంలోని రాజరాంపల్లి, రామభద్రునిపల్లి, శాలపలిల్లిలో పోలింగ్ కేంద్రాలు లేవు. వీరంతా పక్క గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి వస్తోంది. రాజరాంపల్లి, రామభద్రునిపల్లి గ్రా మాల ప్రజలు ఎల్లాపూర్, శాలపల్లి ప్రజలు లింగాపూర్ గ్రామాలకు వెళ్లి ఓటువేయడంతో సమయం వృథా కావడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు తమ గ్రామాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి

కథలాపూర్: మండలంలోని కలిగోట గ్రామానికి అనుబంధంగా ఉన్న గిరిజన తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ తండావాసులు మండల అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో గిరిజన తండా ఉందని, ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ముంతాజొబొద్దీన్, ఎంపీడీవో జనార్దన్‌కు వినతిపత్రం అందించారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

కథలాపూర్: మండలం దుంపేటలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.16 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పంచాయతీ భవనం నిర్మించడంతో ఇబ్బందులు తొలగిపోయాయని స్థానికులు పేర్కొన్నారు. ఎంపీడీవో జనార్దన్, సర్పంచ్ అంబటి లత, ఎంపీటీసీ మల్యాల రమేశ్, ఉపసర్పంచ్ జెల్ల ఉమ, డైరెక్టర్ వేణు, కార్యదర్శి చంద్రశేఖర్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

ఇబ్రహీంపట్నం : కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించవచ్చని వైద్యాధికారి ఉదయ్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పారా మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, సీహెచ్‌వో విజయభాస్కర్, హెచ్‌ఈవో కృపాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి'

కోరుట్ల రూరల్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రామచంద్రం, జిల్లా ఉపాధ్యక్షుడు చింత వెంకట సత్యప్రకాశ్, మండల అధ్యక్షుడు చింత మోహన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎక్కల్‌దేవి రవి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీయస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అయ్యార్ తక్షణమే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సిరిపురం శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెల్మల రాజేశ్వర్ రెడ్డి, మాసం చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

మల్లాపూర్ : అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని గుండంపల్లి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ శివారులోని రహదారిపై ధర్నా చేపట్టారు. గ్రామశివారులో సెల్ టవర్ నిర్మాణం కోసం గ్రామపంచాయతీకి దరఖాస్తు చేయగా అనుమతిని నిరాకరించిందని, అయినా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. సెల్‌టవర్‌తో గ్రామంలో రేడియేషన్‌తో ప్రజలు అనారోగ్యానికి గురవుతారని, సమీపంలోనే ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయించాలన్నారు. ఈ ధర్నాలో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పాఠశాలల్లో 'ఓనం' వేడుకలు

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవి పాఠశాలలో సోమవారం ముందస్తుగా ఓనం వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా పూలతో ముగ్గు వేసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పండుగలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని పాఠశాల కరస్పాండెంట్ పోకల నరేశ్ అన్నారు. కార్యక్రమంలో కేరళ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మల్యాల : కేరళ సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

జ్యోతి పాఠశాలలో..

జగిత్యాల: కేరళ రాష్ట్రంలోని అతిపెద్ద పండగ అయిన ఓనం పండగను జ్యోతి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హరిచరణ్‌రావు, శ్రీధర్ రావు, మౌనికరావు, అజిత, కేరళ ఉపాధ్యాయులు మోలిబీజు, రాజేశ్, అనురాజ్, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

నవజ్యోతి హైస్కూల్‌లో..

కోరుట్ల: పట్టణంలోని నవజ్యోతి హైస్కూల్‌లో ఓనం పండగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తుల్లో నాట్యం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రామాజీపేటలో ఉచిత వైద్యశిబిరం

రాయికల్: మండలంలోని రామాజీపేటలో మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, దోమలతో కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఉపసర్పంచ్ హరీశ్‌రావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ధర్మపురి : ప్రియురాలు మరణం తట్టుకోలేక ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాయపట్నంలో చోటు చేసుకుంది. ఎస్సై దత్తాత్రి వివరాల ప్రకారం.. ఊట్నూరు మండలంలోని బావాపూర్‌కు చెందిన మేస్త్రం గణేశ్ (20) కొంతకాలంగా రాయపట్నంలోని ఎండీ ముజాహిద్ వద్ద మేకల కాపరిగా ఉంటున్నాడు. గ్రా మానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించగా ఆదివారం ఆ యువతి మృతిచెందింది. విషయం తెలిసి గణేశ్ సోమవారం రాయపట్నంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి చిన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.